క్లుప్తంగా...

నేడు పరిశ్రమలకు కరెంట్ బంద్

మేడ్చల్: మరమ్మతుల కారణంగా ఆదివారం ఘనాపూర్ పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు కరెంట్ సరఫరా ఉండదని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశ్రమలకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల సమ్మెకు సంఘీభావం



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

ఘట్‌కేసర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మెకు అఖిలపక్ష నాయకులు శనివారం సంఘీభావం తెలిపారు. కార్మికుల్లో అధికులు దళితులు ఉన్నందున సమ్మె విరమింపజేసేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదని వారు విమర్శించారు. సంఘీభావం తెలిపిన వారిలో టీ పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మండల అధ్యక్షుడు రాజేష్, ముత్యాలుయాదవ్, అంజనేయులు, సంజీవగౌడ్, యాదయ్య, సబితా, జయచంద్ర, ఈశ్వర్, అశోక్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ పట్టణానికి చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి మల్లారెడ్డి తన నివాసంలో అందజేశారు. పట్టణానికి చెందిన తాజుముల్‌హక్‌కు రూ.40 వేలు, డి.విజయకు రూ.25 వేలు మంజూరు కావడంతో ఆ చెక్కులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సందీప్‌గౌడ్, మహేష్‌యాదవ్ తదితరులున్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం



మేడ్చల్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

మేడ్చల్: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాహుల్ గాంధీపై సస్పెన్షన్ వేటు వేశారని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ నాయకులు మేడ్చల్‌లో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రాహుల్‌యాదవ్, నాయకులు రంజిత్, రాకేష్, శ్రీధర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

డప్పుల పంపిణీ



డప్పులు అందజేస్తున్న ఉపసర్పంచ్ వైద్యనాథ్

శామీర్‌పేట: మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో మాదిగలు, డప్పు కళాకారులకు శనివారం గ్రామ ఉపసర్పంచ్ వైద్యనాథ్ డప్పులను పంపిణీ చేశారు. కులవృత్తులను ప్రోత్సహించేందుకు డప్పుడు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్, ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు నర్సింహులు, వీరేశం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిపోయిన మృతదేహం లభ్యం

శామీర్‌పేట: కుళ్లిపోయిన మృతదేహం లభ్యమైన ఘటన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం అంతాయిపల్లి గ్రామ చెరువు సమీపంలో కుళ్లిన మృతదేహం ఉందని డయల్ 100కు కాల్ రావడంతో శామీర్‌పేట పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. పూర్తిగా కుళ్లిపోయి ఉందని, 40–45 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తిగా గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శామీర్‌పేట పోలీసులు తెలిపారు.

దివంగత మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి



మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అంకుషాపూర్‌లో మహేశ్‌యాదవ్, గోపాల్‌రెడ్డి

దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. పలు ప్రాంతాల్లో ఆయన వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు సువరిపాలన అందించి ప్రజల మదిలో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.



ఘట్‌కేసర్‌లో ముత్యాలుయాదవ్, వజ్రేశ్‌యాదవ్



జవహర్‌నగర్‌లో వైఎస్సార్ జయంతిలో వైఎస్సార్ టీపీ నేతలు




బాసిరేగడిలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో..

నామమాత్రంగా పార్టీల జిల్లా అధ్యక్షులు

- జిల్లాకు అధ్యక్షులైనా తమ నియోజకవర్గాలకే పరిమితం
- జిల్లా అంతటా కనిపించని పార్టీల జిల్లా అధ్యక్షులు

మేడ్చల్: జిల్లాలో తమ పార్టీలను బలోపేతం చేస్తూ పార్టీని జిల్లావ్యాప్తంగా నడిపిస్తూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పార్టీ క్యాడర్‌కు దిక్సూచిలా ఉండాల్సిన అన్ని ప్రధాన పార్టీల జిల్లా అధ్యక్షులు నామమాత్రంగా మారిపోతున్నారు. మేడ్చల్ జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లాకు హెడ్ క్వార్టర్‌గా మేడ్చల్ ఉంది. ప్రధాన పార్టీలు తమ జిల్లా పార్టీలకు అధ్యక్షులను ఏర్పాటు చేశాయి. అధికార బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కాంగ్రెస్ పార్టీకి నందికంటి శ్రీధర్, బీజేపీ జిల్లాను అర్బన్, రూరల్‌గా విభజించి రూరల్‌కు విక్రంరెడ్డి, అర్బన్‌కు హరీష్‌రెడ్డిలను నియమించారు. శంభీపూర్ రాజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంకు చెందిన వాడు కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన నాయకుడు. బీజేపీ రూరల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మేడ్చల్ నాయకుడు కాగా, అర్బన్ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన నాయకుడు.



తమ నియోజకర్గాలకే పరిమితమైన జిల్లా అధ్యక్షులు

- జిల్లా అంతటా తిగాల్సిన నాయకులు జిల్లాను వదిలేసి జిల్లా ఏమాత్రం పట్టుసాధించకుండా కేవలం తమ సొంత నియోజకర్గాలకే పరిమితమవుతున్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకుడు. బీఆర్ఎస్ రాష్ట్ర యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నాడు. ఆయన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తుండటంతో జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో ఎక్కడా కనబడటం లేదు. సభలు సమావేశాలు ఆ పార్టీ ఎమ్మెల్యేలే నిర్వహిస్తున్నారు.

తిరుగుబాటు బావుటా ఎగురవేసినా..

- జిల్లా పార్టీ సమావేశాలు కుత్బుల్లాపూర్‌లోనే నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఆయన పర్యటన చేసిన రోజులు వేళ్ల మీద లెక్కపెట్టినన్ని కూడా లేవు. మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలలో సొంత పార్టీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తిరుగుబాటు బావుట ఎగురవేసి సొంత నాయకులపై రోడ్డెక్కినా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా రాజు వారిని సముదాయించింది లేదు. హెచ్చరించిందీ లేదు. చాలామంది నాయకులు పార్టీలో అసమ్మతి ఉన్నా జిల్లా పార్టీ అధ్యక్షుడు నాయకులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని బహిరంగంగానే ప్రశ్నించారు. బీఆర్ఎస్ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎక్కడా కనిపించలేదు.

గ్రూపు రాజకీయాలతో సతమతం

- కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీధర్ మల్కాజ్‌గిరి నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన నాయకుడు. తన నియోజకవర్గంలో పట్టుకోసం ఆయన అధిక శాతం మల్కాజ్‌గిరికే కేటాయిస్తున్నారు. జిల్లాలో ఆ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే లేకపోయినా జిల్లా అధ్యక్షుడిగా ఆయన ఎక్కడా తిరిగిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ అంటేనే గ్రూపు రాజకీయాలకు పెట్టింది పేరు. అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలతో సతమతం అవుతున్నా జిల్లా అధ్యక్షుడిగా ఆయన పోషించాల్సిన పాత్ర, ఆయన ముద్ర ఎక్కడా కనిపించడం లేదు. పార్టీని ఏకతాటిపై నడిపించాల్సిన నాయకుడే కాంగ్రెస్‌కు కరువయ్యాడు.

అధ్యక్షులకు పని తక్కువ..

- బీజేపీలో ఐదు నియోజకవర్గాల జిల్లాను రెండు భాగాలు విభజించడంతో ఆ పార్టీ అధ్యక్షులకు పని తక్కువగా మారిపోయింది. ఆ పార్టీ అధ్యక్షులు తమ సొంత నియోజకవర్గాల కార్యక్రమాలకు హాజరవుతూ తమ ఉనికిని కాపాడుకుంటున్నారు. నియోజకవర్గాలలో మకాం వేసి తమ భవిష్యత్ కోసం మాత్రమే ఆలోచనలు చేస్తున్న అన్ని పార్టీల జిల్లా అధ్యక్షులు జిల్లాలో తమ పార్టీలపై ఏ మాత్రం పట్టులేకుండా కేవలం పార్టీ పదవులకే అలంకారప్రాయంగా తయారయ్యారు.

సద్భావన టౌన్‌షిప్‌లో సమస్యలు పరిష్కరిస్తాం



పోచారం సద్భావన టౌన్‌షిప్‌లో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: హౌసింగ్ బోర్డు నిర్మించిన సద్భావన టౌన్‌షిప్‌లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం పోచారంలోని సద్భావన టౌన్‌షిప్‌లో మంత్రి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టౌన్‌షిప్ అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. స్థానిక కౌన్సిలర్ సామల శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన చైర్మన్ కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు సామల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు, హౌసింగ్ బోర్డు అధికారులు, టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

గౌతంనగర్: అభివృద్ధి పనుల్లో ఆలస్యం చేయకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడ పవన్ మోటర్స్ వద్ద రూ.26 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక సమస్యలు మౌలాలి కమాన్, ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీ వంటి పనులు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రజాశికబద్ధంగా నెరవేరుస్తున్నామన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎల్లప్పుడూ అధికారులతో సమేకమై అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆషాఢ మాసం సందర్భంగా మల్లికార్జునగర్ మల్లన్న దేవాలయంలో పూజలు నిర్వహించి అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు మేకల రాముయాదవ్, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

ఐదుగురు యువకులకు గాయాలు

ఘట్‌కేసర్: కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన ఫహీద్(19), మీరాజ్(20), జబ్బార్(20), వహీద్(21), నిజాం(19) ఘట్‌కేసర్ నుంచి అవుషాపూర్‌కు వెళ్తుండగా హెచ్‌పీసీఎల్ సర్వీస్ రోడ్డు వద్ద యువకులు ప్రయాణిస్తున్న కారు టైరు పగిలి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన యువకులను 108 సిబ్బంది ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై సీఐ మహేందర్‌రెడ్డిని వివరణ కోరగా బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేయలేదని, వారిని విచారించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ ఉమెన్ ఇన్ కామర్స్, ఇండస్ట్రీ ప్రెసిడెంట్ బి.కవితా రాజేష్ అన్నారు. బోడుప్పల్ కేశవనగర్‌లోని కిరణ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన విద్యార్థుల సభ్యత్వ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సభ్యత్వ అధికారాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు రూపేష్, రితేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కస్తూరిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు వందలాది మంది రాజీనామా



మేము సైతం వంతెన కోసం రాజీనామా ప్రకటిస్తున్న ఘట్‌కేసర్ వాసులు

- టీఎస్ఆర్ కన్వెన్షన్‌లో వంతెన బాధితుల సమావేశం
- కౌన్సిలర్లు రాజీనామా చేయాలని డిమాండ్

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పట్టణంలో దశాబ్ద కాలంగా నిర్మిస్తున్న రైల్వే వంతెన పనుల అలసత్వంపై నిరసనగా ఘట్‌కేసర్‌కు చెందిన వందలాది మంది శనివారం బీఆర్ఎస్‌కు రాజీనామా ప్రకటించారు. పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీ చౌరస్తాలోని టీఎస్ఆర్ కన్వెన్షన్‌లో మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో వంతెన బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ స్ఫూర్తితో ఘట్‌కేసర్‌లో మరో పోరాటం చేద్దామన్నారు. ప్రజల మద్దతుతో గెలిచిన కౌన్సిలర్లు వంతెన కోసం, బాధితుల కోసం బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఈడబ్ల్యూకాలనీ, గాంధీనగర్, బాలాజీనగర్, అంబేడ్కర్‌నగర్, ద్వారకానగర్ కాలనీలకు చెందిన వాసులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజనేయులు, గోపాల్‌గౌడ్, వెంకటయ్య, వెంకటేశ్, శశిధర్, ఫయామ్, రవీందర్, శివకృష్ణారెడ్డి, భూషణం వందలాది మంది స్థానికులు పాల్గొన్నారు.

బోనాలకు గ్రామ దేవతల ఆలయాల ముస్తాబు



మేడ్చల్: గ్రామాల్లో ఆషాడం వచ్చిందంటే బోనాల పండగ సందడి ప్రారంభమవుతుంది. ప్రధానంగా నగరంలోని సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయాల బోనాల పండగ నిర్వహించే ఆదివారం నుంచి నగర శివార్లలోని మేడ్చల్‌లో బోనాల పండగ సందడి షురూ అవుతుంది. ఆదివారం మేడ్చల్ పట్టణంలో, వివిధ గ్రామాల్లో బోనాల పండగను నిర్వహించేందుకు ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. మేడ్చల్ ఏడుగుళ్లు, అల్వెల్లి దుర్గమ్మ, పోచమ్మ తదితర ఆలయాల్లో అమ్మవారి బోనాల పండగకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు వేసి ఆలయాల ముందు పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించి, మైకుల మోతతో గ్రామాలను వార్డులను అలంకరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రామాలు ఆడుతున్నాయి

టీ పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్



ఘట్‌కేసర్‌లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ముత్యాలుయాదవ్, వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: బహిష్కరణల పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రామాలాడుతున్నాయని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. రాజీవ్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని యత్నిస్తున్న ప్రధాని మోదీ దిష్టిబొమ్మను పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ బీసీ సెల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో శనివారం దహనం చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కేంద్రం కుటిల యత్నం చేస్తోందన్నారు. కార్యక్రమంలో భానుప్రకాశ్, అంజనేయులు, కాంగ్రెస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజేశ్, ప్రధాన కార్యదర్శి బాబురావు, జవహర్‌నగర్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, శశిధర్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు వినోద్, కౌన్సిలర్ రాజుముదిరాజ్, అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్‌లో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ ముగించుకుని ఉద్యోగ జీవితంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు ఉద్యోగిగా నిబద్ధతతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఉద్యోగం చేస్తున్నప్పటికీ నిత్య విద్యార్థిగా ఉండాలని, ఎప్పటికప్పుడు టెక్నాలజీని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ 2019–23 బ్యాచ్ విద్యార్థులు 519 మంది ప్లేస్‌మెంట్స్ సాధించారని, అత్యుత్తమంగా రూ.11 లక్షల ప్యాకేజీతో 100 శాతం విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్లేస్‌మెంట్ నివేదిక వివరించారు. అంతకుముందు ప్రిన్సిపాల్ శ్రీలత, చైర్మన్ బాలరెడ్డి, డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, రాజేశ్వర్ ప్రసంగించారు. సక్సెస్‌మీట్‌లో అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌లో అధ్యాపకులు, విద్యార్థులు

విద్యార్థులు స్టార్టప్‌లపై దృష్టి సారించాలి

ఘట్‌కేసర్: విద్యార్థులు స్టార్టప్‌లపై దృష్టి సారించాలని చార్టెర్డ్ సీఈఓ, వ్యవస్థాపకురాలు అరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో ప్రారంభ పరస్పర చర్యలు అన్న అంశంపై ఏఐఐ, సీఎస్ఐ అనుసంధానంతో విద్యార్థులకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు వ్యాపార అభివృద్ధికి అవసరమైన మెళకువలు నేర్చుకోవాలన్నారు. తమ ఆలోచనలను అమలు చేసి వ్యాపారంపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సలహాదారులు మమతారెడ్డి, శిరీషచంద్రా, పీయూశ్ సిన్హా, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

